క్లుప్తంగా

స్వచ్ఛతపై చైతన్యం



నందబలగలో గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలో గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని నందబలగలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెత్త సంపద కేంద్రంలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం



గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సంతకవిటి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రీన్ అంబాసిడర్లను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్, తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండగూడేం సర్పంచ్ కెంబూరు వెంకటప్పలనాయుడు, రామారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, వంతరాపు నానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా ప్రమాణం



సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో గత నెల 17 నుంచి చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

నేను సైతం..



నిచ్చెనపై ఎక్కి కార్యాలయం గోడలను శుభ్రం చేస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం మున్సిపల్ కార్యాలయం పరిసరాలను శుభ్రం చేశారు. నిచ్చెనపైకి ఎక్కి గోడలపై ఉన్న పిచ్చి మొక్కలు, నాచును తొలగించారు.


42 మందికి నేత్ర పరీక్షలు



కంటి శస్త్రచికిత్స కోసం వెళుతున్న రోగులు

సంతకవిటి: క్రమం తప్పకుండా 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ రెండు సంవత్సరాలకు ఒకసారి సమగ్ర నేత్ర పరీక్షలు చేయించుకోవాలని ఆప్తాలమిక్ వసంతరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణంలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ యు.నేగేంద్రప్రసాద్, ఆప్తాల్మిక్ వసంతరావు 42 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 20 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, వారిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు.

ప్రయాణం నరకం



ఆటోను పైకి లేపుతున్న ప్రయాణికులు

సంతకవిటి: మండలంలోని మల్లయ్యపేట-హొంజరాం పకరదాన రహదారిలో రామారాయపురం వద్ద పొలాల నుంచి వచ్చే వరదనీరు రోడ్డు పైనుంచి ప్రవహిస్తుండడంతో వాహన చోదకులకు ప్రయాణం నరకంగా మారుతోంది. గుంతలు ఏర్పడడంతో పాటు నాచు అధికంగా ఏర్పడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. బుధవారం ఓ ఆటో గుంతలో దిగిపోవడంతో అందులో ప్రయాణికులు కిందకు దిగి ఆటోను పైకిలేపారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం



బొబ్బిలి: గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

జాతిపిత మహాత్మా గాంధీ త్యాగ ఫలితమే మనం ఇప్పను అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని బొబ్బిలి పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యం, అహింసను ఆయుధంగా చేసుకుని శాంతిమార్గంలో స్వాతంత్ర్య పోరాటాన్ని చేసిన మహాత్ముని జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలో అన్ని మండలాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. – బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



రేగిడి: ఎమ్మార్సీలో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, ఎరకయ్య, సిబ్బంది



రాజాం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో డాక్టర్ తలే రాజేష్, తదితరులు



వంగర: సచివాలయంలో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ లోపింటి త్రినాథ్, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



బొబ్బిలి: గాంధీ జయంతి వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, తదితరులు



రామభద్రపురం: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు



బాడంగి: మండల పరిషత్‌లో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రామారావు, వైస్ ఎంపీపీ భాస్కరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మహేశ్వరరావు, తదితరులు



తెర్లాం: తెర్లాం అంగన్‌వాడీ-5 కేంద్రంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్యకర్త శ్రీదేవి, చిన్నారులు



సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు



రాజాం సిటీ: మున్సిపల్ వర్కర్లకు పూల మొక్కలు అందజేస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

సేవలే గుర్తింపునిస్తాయి

రాజాం సిటీ: నిస్వార్థంగా చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన మొయ్యి శ్రీరాములను స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని యోగావికాస్ కేంద్రంలో ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనదైనశైలిలో కృషిచేసి ఇటు గ్రామస్తులు, అటు అధికారుల మన్ననలు పొందడం గొప్పవిషయమన్నారు. ఫలితం ఆశించకుండా ప్రయత్నం చేస్తే తప్పకుండా విజయం సాధిస్తామని



శ్రీరాములను సత్కరిస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ సభ్యులు

పేర్కొన్నారు. కార్యక్రమలలో ఏపీసీపీఎస్‌ఈఏ గౌరవాధ్యక్షులు మక్క సురేష్, మొయ్యి జనార్దన్, యోగా వికాస్ నిర్వాహకులు కొరికాన శ్రీనివాస్, కొరికాన శంకర్, పెంటన్నాయుడు, సత్యం నాయుడు, డోల వాసు, హుస్సేన్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో ఉపాధి పనుల గుర్తింపు

రేగిడి: గ్రామసభల ద్వారా ఉపాధి పనులను గుర్తించడం జరుగుతుందని ఎంపీడీఓ శ్యామలాకుమారి అన్నారు. మండలంలో అంబఖండిలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులకు ఉపయోగపడే పనులను గుర్తించి గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. ఉపాధి వేతనదారులు, గ్రామస్తులు ఆయా పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథరావు, గ్రామానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, రైతులు, ఉపాధివేతనదారులు పాల్గొన్నారు.

బాడంగి: మండల కేంద్రం బాడంగిలో సర్పంచ్ కండి రమేష్ అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి నిధులతో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రాణాళికలు రూపొందించి గ్రామ సభ ఆమోదం పొందారు. అంతకుముందు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రతి ఒక్కరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ మహేశ్వరరావు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సూర్యరావు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

బొబ్బిలిరూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామంలో ఓ కుటుంబం తృటిలో ప్రమాదాన్ని తప్పించుకుంది. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన ఎచ్చర్ల అప్పన్న, మంగమ్మ దంపతులకు చెందిన ఇంటి శ్లాబ్ మంగళవారం రాత్రి కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంటి బయట ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ భాస్కరరావు బుధవారం ఆ ఇంటిని పరిశీలించారు. 20 ఏళ్ల భవనం కావడం, ఇటీవల కురిసిన వర్షాలకు శ్లాబ్ పూర్తిగా నానడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



శ్లాబ్ కూలిన ప్రదేశంలో బాధితులు అప్పన్న, మంగమ్మ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజాం: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మొగిలివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మొయ్యి శ్రీరాములు అన్నారు. గ్రామంలోని శివాలయం వద్ద బుధవారం పాఠశాల విద్యార్థులు, గ్రామానికి చెందిన యువతతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం వాటి సంరక్షణ బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులకు, యువతకు అప్పగించారు. రాజాం పర్యావరణ పరిరక్షణ సమితి సహకారంతో మొక్కలు నాటామని, గాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున సహకరించారని అన్నారు. కార్యక్రమంలో ఎం.రమేష్, ఎస్.రమేషు, ఆబోతుల దుర్గారావు, గ్రామానికి చెందిన యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మొగిలివలసలో మొక్కలు నాటుతున్న శ్రీరాములు, యువత

కార్మిక చట్టాలపై అవగాహన

రాజాం: అసంఘటిత కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు సూచించారు. పట్టణంలోని మారుతీనగర్, బాబానగర్, గాయత్రీకాలనీ, వాసవీనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించి భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడారు. ఈ-శ్రమ్ యాప్‌పై వారికి అవగాహన కల్పించారు. ఈ-శ్రమ్ యాప్‌లో నమోదు కావడం వల్ల కలిగే బీమా ప్రయోజనాలను వివరించారు. అనంతరం మాధవ బజార్‌లో పలు దుకాణాలను తనిఖీ చేసి కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు.



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఏఎల్‌ఓ కొండలరావు

నేడు ఆకులకట్టలో గ్రామ సందర్శన

బాడంగి: మండలంలోని ఆకులకట్టలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ మహేస్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండల నోడల్ ఆఫీసర్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రామభద్రపురం: పత్తి పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటయ్య అన్నారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో సాగులో ఉన్న వివిధ రకాల పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. పత్తి పంట సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. పంట పూత, పిందె, కాయ దశలో గులాబి రంగు పురుగు ఆశించే అవకాశం ఉందని, రైతులు సకాలంలో పురుగు ఉనికిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గులాబీ పురుగు నివారణకు ఎకరానికి 4 లింగాకర్ష బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఎకరానికి 15 లింగాకర్ష బుట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. కాయకుళ్లు తెగులు నివారణకు ట్రెప్టోసైకిలిన్ 0.1 గ్రాం, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు చప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాయ పగుళ్లను అరికట్టేందుకు లీటరు నీటికి 20 గ్రాముల యూరియా గాని, 10 గ్రాముల 19–19–19 మందుకు 2 గ్రాముల బోరాన్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



కొండకెంగువలో పత్తిసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వెంకటయ్య

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని నారశింహునిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో తెలిపారు. మక్కువ ఫీడర్‌లో మరమ్మత్తులు చేపడుతున్నందున ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై

వంగర: స్థానిక పోలీస్ స్టేషన్, మగ్గూరు జంక్షన్ వద్ద ఎస్సై షేక్ శంకర్ బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులుపై అపరాధ రుసుం విధించారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

గాయత్రీ ఆలయంలో దసరా ఉత్సవాలు

రాజాం: పట్టణంలోని గాయత్రీకాలనీలో ఉన్న గాయత్రీదేవీ ఆలయంలో గురువారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వాసా జగదీశ్వరశర్మ బుధవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో అమ్మవారికి సహస్ర కుంకుమార్చనతో పాటు విశేష పూజలు ఉంటాయని వివరించారు. ఈనెల 12 వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.



పూజలందుకుంటున్న గాయత్రీదేవి

వండానపేటలో వైద్యశిబిరం



ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

రేగిడి: మండలంలోని వండానపేట గ్రామంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సోహినీరాఘవ్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఈ వైద్యశిబిరం నిర్వహించి, పలువురు గ్రామస్తులకు వైద్య తనిఖీలు చేపట్టారు. అనంతరం ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య సూత్రాలు వివరించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ జ్వరాలు వస్తున్నాయని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ సర్పంచ్ వియ్యపు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

బొబ్బిలిరూరల్: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జూనియర్ విభాగంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి బుధవారం బయలుదేరి వెళ్లిన క్రీడాకారులను తోటి క్రీడాకారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు. మండలంలోని పారాది జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బెల్లాన సుప్రియ, అల్లాడ తేజస్విని, పి.చైతన్యకుమారి, జస్వంత్ వేణు, జనార్దనసాయి ఈనెల 7 నుంచి 11 వరకు కర్నూల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. వారికి స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్యే బేబినాయన, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి సాయిరమేష్, పీడీలు వెంకటనాయుడు, తదితరులు అభినందనలు తెలియజేశారు. విజయంతో తిరిగి రావాలని కాంక్షిస్తూ ఆల్ ద బెస్ట్ చెప్పారు.



కర్నూల్ వెళ్లేందుకు స్థానిక రైల్వేస్టేషన్ వద్ద క్రీడాకారులు, కోచ్‌లు

క్షేత్ర పరిశీలనతో విద్యార్థుల్లో చైతన్యం

సంతకవిటి: క్షేత్ర పరిశీలనలతో విద్యార్థుల్లో చైతన్యం వస్తుందని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటరావు అన్నారు. పాఠశాలలో చదువుతున్న 7, 8 తరగతుల విద్యార్థులను బుధవారం క్షేత్ర పరిశీలన నిమిత్తం శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం అంతకాపల్లి అడవుల్లో ఉన్న కూర్మ గ్రామాన్ని సందర్శన నిమిత్తం తీసుకెళ్లారు. సాంకేతికత అందుబాటులో లేని సమయంలో మానవ జీవన విధానం, ప్రస్తుతం సాంకేతిక ప్రపంచానికి దూరంగా జీవిస్తున్న ప్రజల స్థితిగతులు, కాలుష్యంలేని సమాజం వంటి అంశాలను అక్కడ వివరించారు. ఇటువంటి పరిశీలనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆలోచనను బయటకు తీస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు బూరాడ శ్రీనివాసమ్ విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించారు. మరో ఉపాధ్యాయులు రామ్మూర్తినాయుడు విద్యార్థులతో ఈ క్షేత్ర పరిశీలనను ప్రాజెక్ట్‌గా రూపొందించారు.



కూర్మ గ్రామాన్ని సందర్శించిన సిరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు

కాలువ నిర్మాణం పరిశీలన

రేగిడి: మండలంలోని అప్పాపురం సమీపంలోని జంగాలపేట గ్రామం వద్ద నిర్మిస్తున్న సీసీ కాలువను పీఐయూ డీఈఈ కన్యాకుమారి, ఏఈ ఆనందరావు బుధవారం పరిశీలించారు. ప్రధాన రహదారికి ఏడుమీటర్లు లోపు కాలువ నిర్మిస్తున్నట్లు అప్పాపురం గ్రామ టీడీపీ కార్యకర్తలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కాలువను పరిశీలించిన అధికారులు కాలువ నిర్మాణం నిబంధనలు ప్రకారం జరిగిందని, ప్రధాన రహదారికి ఏడు మీటర్లు దాటించే ఉందని ధ్రువీకరించారు. ఫిర్యాదుదారుల ఆరోపణలో వాస్తవం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న డీఈఈ, తదితరులు

పనసలవలసలో 'భారత్ అభియాన్'

రేగిడి: మండలంలో పనసలవలస గ్రామంలో భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ అభియన్‌లో భాగంగా పనసలవలస గ్రామాన్ని తమ కళాశాల దత్తత తీసుకుందన్నారు. కేంద్ర మానవ వనరుల శాఖ సహకారంతో గ్రామంలో సమగ్ర సరే నిర్వహించి, గ్రామంలోని సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామన్నారు. అనంతరం గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పించి గ్రామంలో శాంతి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాథం, భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.తేజేశ్వరరావు, మండల స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ సీహెచ్.పద్మ, సర్పంచ్ గేదెల గోవిందరావు, కడగల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పనసలవలసలో భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్న జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్, తదితరులు

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

బాడంగి: మండలంలోని పినపెంకి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొబ్బిలి మండలం మెట్టవలసకు చెందిన ఎద్దు వాసు ద్విచక్రవాహనంపై బొబ్బిలి వైపు వెళ్తుండగా పినపెంకి సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. క్షతగాత్రుడి తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కొండలరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

యూటీఎఫ్ నాయకుల సత్యాగ్రహ దీక్ష

బొబ్బిలి రూరల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, మహాత్మ గాంధీ ఆశయాలను నెరవేర్చాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యగ్రహదీక్షలు చేపట్టారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద బుధవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్షలు చేపట్టారు. విద్యారంగంలో టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు విజయగౌరి డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్లను విద్యాశాఖలో విలీనం చేసిన తరువాత ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని కోరారు. జీపీఎఫ్ నంబర్లు కేటాయించాలని, దశలవారీ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు ఈనెం శ్రీను, ప్రసన్నకుమార్, కృష్ణదాస్, తదితరులు పాల్గొన్నారు.



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న యూటీఎఫ్ సభ్యులు